

ఐటిఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పెంచి అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ రామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తికర అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ లోపు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో సమీప ఐటిఐ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 23, 25వ తేదీలలో ప్రభుత్వ ఐటిఐ, 26, 27వ తేదీలలో ప్రయివేట్ ఐటిఐ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తారని, అభ్యర్థులు ఏ ఐటిఐకి దరఖాస్తు చేసుకున్నారో ఆ ఐటిఐ కళాశాలలో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. పదవ తరగతి మార్కుల లిస్టు, టిసి, ఆధార్, మెయిల్ ఐడి, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని, అడ్మిషన్ ప్రక్రియ అయ్యాక వాటిని కళాశాలలో సమర్పించాలని తెలిపారు. ఐటిఐ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు.

గండికోటలో దారుణం

- ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం.. హత్య!
- ముళ్లపొదల్లో మృతదేహం
- పోలీసుల అదుపులో అనుమానితుడు?
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి, డిఎస్‌పి
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



గండికోట ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి మంగళవారం ఉదయం కలకలం రేపింది. ఎక్కడ, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... ప్రొద్దుటూరులోని సార్వకట్ట వీధికి చెందిన బాలిక పట్టణంలోనే గీతం జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. ఆమె సోమవారం ఉదయం యథావిధిగా కళాశాలకు వచ్చి తోటి స్నేహితులతో గండికోటకు వెళ్తున్నానని, కళాశాల వదిలే సమయానికి వస్తాను అని చెప్పి లోకేష్ అనే వ్యక్తితో బైక్‌పై వెళ్లింది. వారు గండికోటకు వెళ్లినట్లు టోల్ ప్లాజా వద్ద సిసి టివి ఫుటేజీలలో దృశ్యాలు కన్పించాయి. తిరుగు ప్రయాణంలో బైక్ పైన లోకేష్ ఒక్కడే వెళ్లినట్లు సిసి ఫుటేజీలో కన్పించింది. ఒకవైపు సాయంత్రం 7.30 అయినా కళాశాల నుంచి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు ప్రొద్దుటూరులోని ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. బాలిక కోసం వెతకడం ప్రారంభించారు. పోలీసులు సిసి టివిలు తనిఖీ చేశారు. ఇదే సమయంలో మంగళవారం ఉదయం గండికోటలోని రంగనాథస్వామి దేవాలయం వెనుక భాగాన ముళ్లపొదల్లో బాలిక మృతదేహం వివస్త్రంగా కన్పించింది. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని కూతురిని అలా చూసి వారి హదయం తల్లడిల్లిపోయింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న గండికోటలోని ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఒక్కసారిగా బాలిక మతదేహం చూసి నివ్వెరపోయారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాస్తవానికి బాలికది ఎర్రగుంట్ల మండలం అల్లదుర్తి (హనుమాన్ గుత్తి) గ్రామం. అదే గ్రామంలోని లోకేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసుస్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. ఆ తర్వాత ఆరు నెలల కిందట ప్రొద్దుటూరుకు వచ్చి సార్వకట్ట వీధిలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. కాగా అనుమాతిడిగా భావిస్తున్న లోకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. లోకేష్‌తో పాటు ఈ సంఘటనలో ఎవరెవరు పాల్గొన్నారనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.



అనుమానితుడు లోకేష్

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

సంఘటన విషయం తెలుసుకున్న ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ వెంటనే సంఘటనా స్థలానికిచేరుకుని హత్యకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక మతికి కారణాలు ఇంకా పూర్తిగా తెలియలేదని తెలిపారు. తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆమేరకు విచారణ చేపట్టామన్నారు. డాగ్ స్క్వాడ్‌తో క్లూస్ టీం విచారిస్తుందన్నారు. ఆయనతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, డిఎస్‌పిలు వెంకటేశ్వరరావు, భావన, ట్రైనీ డిఎస్‌పి భవాని, అర్బన్ సిఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి ఉన్నారు.



ముళ్లపొదల్లో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

జమ్మలమడుగులోని గండికోటలో ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి కఠిన దండన విధించాలని ఎపి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో నమ్మించి చంపిన అల్లగుత్తి లోకేష్‌పై కఠిన చర్యలతో పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉరితీయాలని పిఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి, ఎన్‌డిఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జైష్ఠాది భాస్కర్ పేర్కొన్నారు. వారు ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థినికి హత్య చేసిన నిందితుడని కఠినంగా శిక్షించాలని ప్రొద్దుటూరు వ్యవసాయ కార్మిక సంఘ: నాయకులు గుర్రం డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

గండికోట పర్యాటక ప్రాంతంలో మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ సహయ కార్యదర్శి హరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఓ ప్రయివేట్ కళాశాలలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ తెలిపారు. నిత్యం గండికోట ప్రాంతం పర్యాటకుల సందర్శనాంతం కళకళలాడుతుందని, ఈ తరుణంలో అఘాయిత్యా సంఘటనలు జరగడం చాలా బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు జరగాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాలికపై లోకేష్ అనే వ్యక్తి హత్య చేయడం దుర్మార్గపు చర్యన్నారు. నిందితుడిని అరెస్టు చేసి తగిన చర్యలు కఠిన శిక్షను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా గండికోటలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని హత్యకు గురికావడంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గండికోటలో దారుణ హత్యకు గురికావడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడానన్నారు. దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. మహిళలు, బాలికలపై హత్యలకు, హత్యాచారాలకు పాల్పడితే సహించేది లేదని, ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు.

మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వ వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరసన ప్రదర్శన చేశారు. సమ్మెలో భాగంగా 3వ రోజైన మంగళవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేత శంకరయ్య మాట్లాడుతూ జిఒ 36 ప్రకారం టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు వేతనం రూ.24,500లను అమలు చేయాలన్నారు. రిస్క్‌అలవెన్స్‌ను ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులందరికీ వర్తింపచేయాలన్నారు. కార్మికులందరికీ గ్రాట్యుటిని అమలు చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. నాణ్యమైన పనిముట్లు, చెప్పులు, దుస్తులు అందచేయాలన్నారు. కార్మికులందరికి బేషరతుగా సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింప చేయాలంటూ కోరారు. తమ డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే అంగీకరించని పక్షంలో ఈనెల 17న విజయవాడలోని సిడిఎంఎ కార్యాలయాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చుని నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కృత్రిమ మేధపై నైపుణ్యాలు గడించాలి : డిఇఒ



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రస్తుత ప్రపంచంలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కృత్రిమ మేధ నైపుణ్యాన్ని గడించాల్సిన అవసరమెంతైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డైట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వృత్తి విద్య శిక్షణ అందుబాటులో ఉందని, ప్రభుత్వం నిష్ణాతులైన ట్రైనర్‌లను అందుబాటులో ఉంచిందని చెప్పారు. పాఠ్యాంశాలకు అదనంగా చిన్న ప్పటి నుంచి వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో త్వరగా స్థిర పడవచ్చని పేర్కొన్నారు. నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, పాఠశాలలో అందుబాటులో ఉన్న వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, విద్యార్థి సమూహాలతో కూడిన రోల్‌ప్లే నిర్వహించామని చెప్పారు. 'మై ట్రేడ్-మై డ్రీమ్' పేరుతో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, కేస్ స్టడీస్, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో ఏర్పాటు చేసిన కెరీర్ పాత్ చార్ట్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలా దేవి, సమగ్ర శిక్షా సిఎంఒ కరుణాకర్, ఎపిఒ చంద్ర శేఖర్, జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ యోగేష్ కుమార్‌రెడ్డి, పాఠశాల వొకేషనల్ ట్రైనర్లు మహబూబ్ బాషా, రామాంజినేయులు, సాయి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు మహమ్మద్ ఖలీద్, ఉపాధ్యాయులు ఫణీంద్ర, పరశురామ్ పాల్గొన్నారు.

గణితం పట్ల భయాన్ని పోగొట్టాలి : గణితం పట్ల విద్యార్థులకు ఉండే భయాలను పోగొట్టడానికి గణితం క్లబ్బులు కృషి చేయాలని డిఇఒ సుబ్రహ్మణ్యం సూచించారు. డైట్ అధ్యాపకులు శివభాస్కర్, కేదార్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఆసక్తికరంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించ డానికి నూతన విధానాలను గణిత ఉపాధ్యాయులు అనుసరించాలన్నారు. గణిత ఆటలు, పజిల్స్, క్విజ్‌లు వంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమస్య పరిష్కార నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థులలో పెంపొందించాల న్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు మాట్లాడుతూ డైట్ ఒక ప్రయోగశాలగా బోధ నాభ్యసనలో వినూత్న విధానాలను రూపొందించడం జరుగుతూ ఉందన్నారు. మెరుగైన ఫలితాల సాధన దిశగా డైట్ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసిం హారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్, ప్రధానోపాధ్యాయులు రవీంద్ర నాథ్‌బాబు, అధ్యాపకులు వెంకట సుబ్బారెడ్డి, వై.సి.రెడ్డిప్పరెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళిక తయారీలో జాగ్రత్తలు పాటించండి : డిపిఒ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

పంచాయతీ పురోగతి ప్రణాళిక తయారీలో అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని డిపిఒ రాధమ్మ, డిఎల్‌డిఒ లక్ష్మీపతి కోరారు. మంగళవారం రాయచోటి రూరల్ ఎంపిడిఒ సభాభవనంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 ఆర్థిక సంవత్సరం 2023-24లో భాగంగా 2025-26 పంచాయతీ పురోగతి ప్రణాళిక తయారీపై జిల్లాలోని ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రణాళిక తయారీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రణాళిక తయారీలో మెలకువలు పాటించాలంటూ సూచించారు. ఎస్‌డబ్లుపిసి నిర్వహణ, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టంను ప్రజలు రిసీవ్ చేసుకునేలా చూడాలని, చెత్తసేకరణ తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. మున్సిపాలిటీల తరహాలో గ్రామాల్లో కూడా పన్నుల వసూలు ఆన్‌లైన్ ద్వారా సక్రమంగా వసూలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పిఆర్ ఎస్ఇ దయాకర్‌రెడ్డి, డిఎఒ శివనారాయణ, డిఇఒ సుబ్రమణ్యం, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణతో పాటు జిల్లాలోని 30 మండలాల ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఒ రాధమ్మ

విద్యార్థులు నైపుణ్య విద్యను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థులు నైపుణ్య విద్యను అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు భారతి పిలుపునిచ్చారు. కొత్త బోయినపల్లి ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు, ఉద్యోగంతో పాటు ప్రతి ఒక్కరు తమ సొంత కాళ్లపై నిలబడేలా నైపుణ్యం మెరుగు పరుచు కోవాలని సూచించారు. పాఠశాల వరండాలో తిను బండారాలు అమ్ము కునే చిన్నం లక్ష్మీదేవి అనే వృద్ధురాలు ఇటీవల ఆకస్మికంగా మరణించగా ఆమె భర్త వెంకటసుబ్బయ్య భార్య జ్ఞాపకార్థం రూ.20 వేలు పాఠశాలకు వితరణ చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాడని అదే వేదికగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రశాంత్ విద్యార్థినీ, విద్యార్థులకు నైపుణ్య విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని డెమో ద్వారా ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెంచ లరావు, ఉపాధ్యాయులు ఓబులేసు, పి.జనార్దన్, బి.శేషగిరి, ఎస్.వి.రామరాజు, ఎ.శివ ప్రసాద్ గౌడ్, ఎస్.ప్రభాకర్ రావు, ఎం.చెన్న కేశవులు, పి.విజయ భాస్కర్, శ్రీరాములు, అనిల్ కుమార్, వి.రాజయ్య, అమరావతి, ప్రణవి, సువర్ణసుందరి, మధురవాణి, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.



నైపుణ్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వైభవంగా ముగిసిన 'తాళ్లపాక' బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమా చార్యులు స్వయంగా అర్చించి, పూజించిన శ్రీసిద్దేశ్వర స్వామి, శ్రీచెన్నకేశవ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించిన పుష్పయాగంతో ముగిశాయి. టిటిడి, హిందూ ధర్మప్రచార పరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టులు సంయుక్తంగా పది రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించాయి. ప్రతిరోజు ఉదయం, సాయంకాలం వేళల్లో వివిధ రకాల వాహన సేవలు, ఆర్జిత కల్యాణోత్సవం, రథోత్సవం, చక్రస్నానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, అన్నమయ్య సంకీర్తనలు, హరి కథలు, భజనలు, కోలాటాలతో తాళ్లపాక మాడవీధులు శోభాయ మానంగా భక్తులకు కనువిందు చేశాయి. ప్రతిరోజు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కోలాట బృందాలు, ఉపన్యాసకులచే కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ చింతకుంట శివారెడ్డి, దామోదరమ్మ, నారాయణరెడ్డి, గంగనపల్లె వెంకటరమణ, స్రవంతి, డాక్టర్ పి.నీలవేణి, డాక్టర్ ఎ.చంద్రశేఖరరెడ్డి, రాజారెడ్డి, జయలక్ష్మి, రామమోహన్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, గంగావతి, సుభాషిణి, భారతి, లక్ష్మిదేవి, శివమ్మ, అంజలి, కృష్ణార్జున, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, శంకరమ్మ, విజయ్ కుమార్, ఈశ్వరమ్మ, గంగాదేవి, మునిసాయి, సరస్వతి, శశికళ తదితర కళాకారుల బృందాలచే కోలాటం, అన్నమాచార్య సంకీర్త గానామృతం, సంప్రదాయ నృత్యాలు వాహనసేవల్లో భాగంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి అన్ని ఏర్పాట్లను చేయడంతోపాటు, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు బ్రహ్మోత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయి.

ఉర్దూ విద్యా సంస్థలను బలోపేతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థలను బలోపే తం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసి యేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ హుస్సేన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక , ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మెగా డిఎస్‌సిలో ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలల, మోడల్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులు చూపించక పోవడంతో ఆ పాఠశాలలో విద్యాభ్యాసం కష్టతరంగా మారిందన్నారు. వెంటనే ఆయా ఉపాధ్యాయ ఖాళీ స్థానాలలో అర్హులైన ఉర్దూ మీడియం విద్యావాలంటీర్లను నియమించాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికైనా స్పందించి ఉర్దూస్పెషల్ డిఎస్‌సిని నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి అవసరమైన పట్టణ, నగర శివార ప్రాంతాలలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి ఉర్దూ విద్యా రంగానికి జీవం పోయాలని కోరారు. రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలని కోరారు. యోగివేమన, నాగార్జున విశ్వవిద్యాలయాలలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్లను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసి ఉర్దూ భాషాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

మధ్యవర్తిత్వమే సముచిత మార్గం : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు

వ్యక్తుల మధ్య వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే సముచిత మార్గమని పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు సముదాయంలో పోలీసు అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కరించుకుంటే కలిగే ప్రయోజనాలను ప్రజలకు, కక్షిదారులకు వివరించేందుకు 90 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీకి అర్హత కలిగిన వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలని, ఈ మార్గం ద్వారా కక్షిదారులకు డబ్బు వృధా కాకుండా, సమయం కూడా ఆదా అవుతుందని, ఇలాంటి అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్

'మిట్స్'కు యూనివర్సిటీ హోదా

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యా నైపుణ్యం, ఆవిష్కరణలకు నిబద్ధతకు పేరుగాంచిన ప్రతిష్ఠాత్మక సంస్థ మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్), భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఇఒ) 1956 యుజిసి చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం డీమ్డ్ టు బి యూనివర్సిటీగా అధికారికంగా ప్రకటించిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. విద్యా స్వయంప్రతిపత్తి, ప్రపంచ సహకారాలు, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన, ఫలితాల ఆధారిత విద్య వైపు సంస్థ ప్రయాణంలో ఈ ముఖ్యమైన గుర్తింపు ఒక ప్రధాన మైలురాయిని సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కొత్త హోదాతో, మిట్స్ మెరుగైన విద్యా కార్యక్రమాలను అందించడానికి, అంతర్జాతీయ సంబంధాలను ఏర్పాటు చేయడానికి, ఆవిష్కరణ సృష్టించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ గుర్తింపు మా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, దార్శనిక నిర్వహణ యొక్క నిరంతర ప్రయత్నాలకు నిదర్శనమని, ఉన్నత విద్య, పరిశోధనలలో మిట్స్‌ను ప్రపంచ ప్రమాణాలకు పెంచడానికి ఇది ఒక మంచి అవకాశమని తెలిపారు. ప్రపంచ స్థాయి అభ్యాస వాతావరణాన్ని అందించడం, పరిశ్రమలకు సిద్ధంగా ఉన్న గ్రాడ్యుయేట్లను అభివృద్ధి చేయడం, జాతీయ, ప్రపంచ అభివృద్ధి లక్ష్యాలకు గణనీయంగా దోహదపడటం పట్ల కళాశాల ఎల్లప్పుడు దోహద పడుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్నత విద్య యొక్క భవిష్యత్తును రూపొందించడానికి అంకితమైన డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది అని, ప్రపంచ స్థాయి విద్యను విద్యార్థులకు అందించడం మే మా ముఖ్య ఉదేశ్యం అని, ఈ హోదాకు సకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేసారు.



యూనివర్సిటీ గుర్తింపు పొందిన మిట్స్ కళాశాల

సామాజిక భద్రత పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం, సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు కౌన్సిలర్ సి.సుధాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని దొడ్డిపల్లిలో జరిగిన మహిళల అవగాహన కార్యక్రమంలో దొడ్డిపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవన జ్యోతి బీమా యోజన, డిజిటల్ ట్రాన్సాక్షన్ల గురించి ప్రజలకు వివరించారు. ఆర్‌బిఐ విడ్స్ స్వచ్ఛంద సంస్థ మొదటి కౌన్సిలర్ సి.సుధాకర్ మాట్లాడుతూ తమ సంస్థ పీలేరు కేంద్రంగా మూడు మండలాల్లో పనిచేస్తోందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపివై అటల్ పెన్షన్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకానికి 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు వారందరూ అర్హులన్నారు. ఈ పథకంలో చేరిన వారు 61 సంవత్సరం నుంచి పెన్షన్ పొందవచ్చని తెలియజేశారు. లబ్ధిదారుల వయస్సు ఆధారంగా ప్రతి నెల వారి వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించవచ్చని చెప్పారు. సామాజిక భద్రత పథకాల్లో చేరిన వారు ఏ కారణం చేతనైనా మరణిస్తే, మృతుని డాక్యుమెంట్స్‌ను సంబంధిత బ్యాంకు అధికారులకు లేదా సిఎఫ్ఎల్ కౌన్సిలర్ కు తెలియజేస్తే వారు క్లైమ్ పొందడం సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సిసి కవిత, సంఘమిత్ర సుజాత, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సంక్షేమ పాలన అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కురవంక పంచాయతీలోని ఎగువ కురవంక, భువనేశ్వరి నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గురించి ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేయాలనీ చూస్తే అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం, ప్రజారాజధాని అమరావతి నిర్మాణాలు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతోందన్నారు. కురవంక పంచాయతీలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. అనంతరం కురవంక సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుండి స్వీకరిస్తున్న అర్జీలను రిజిస్టరులో నమోదు చేశారా లేదా అనే అంశాన్ని కంప్యూటర్ నందు పరిశీలించారు. అనంతరం కురవంక నందు షేక్ షాహిరాకు రూ.5 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బెల్లెరెడ్డి ప్రసాద్, బొమ్మిశెట్టి పురుషోత్తం, గంగారపు రామ్మూర్తి నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, బీదం గురునాథ్ యాదవ్, నాగార్జున బాబు, జంగాల వెంకటరమణ,బోనాసి జాన్ బాబు, రైస్ మిల్‌శశి, తమ్మిశెట్టి రామకృష్ణ, మధు, వేణు, జివి నాయుడు, నవీన్ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మార్కెట్‌లో మట్టితో గుంతలను పూడుస్తున్న కూలీలు

టమోటా మార్కెట్‌లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రంలోని కలకడ టమోటా మార్కెట్ ప్రాంతంలో పారిశుధ్యం పనులను చేపట్టినట్లు మండల డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. టమోటా మార్కెట్‌లో కొద్దిపాటి వర్షానికి బురదమయంగా మారుతూ దుర్గంధ భరితంగా ఉండటంవల్ల సర్పంచ్ ప్యారిజాన్ దృష్టికి పంచాయతీ కార్యదర్శి తీసుకెళ్లినట్లు తెలిపారు. సర్పంచ్ స్పందించి పంచాయితీ నిధులను ఉపయోగించి టమోటా మార్కెట్‌లో మట్టితోలి గుంతలను పూడ్చడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జెసిపి సహాయంతో మట్టిని త్రవ్వి ట్రాక్టర్ల సహకారంతో బురదమయంగా ఉన్న గుంతలను పూడ్చివేయించినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఏ కొద్దిపాటి వర్షం పడిన బురదమయంగా మారడమే కాకుండా, టమోటాలు పడి కుళ్ళిపోవడం వల్ల రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నందువల్ల మట్టిని తొలించి చదును చేయించినట్లుతెలపారు. మార్కెట్‌లో టమోటా మండి యజమానులకు, రైతులకు ఇబ్బంది కలగకుండా మట్టిని తోలి చదును చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, జావీద్ అలీ ఖాన్, రైతులు, మండి యజమానులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని తెలుగు స్కూల్లో పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీరబల్లికి చెందిన నాగరాజ ఆర్థిక సాయంతో మంగళవారం నోట్ బుక్స్, పెన్నులు,పెన్సిళ్ల పంపిణీ చేశామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మహమ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, షంషీర్‌వలి, రామాంజనేయులు, స్కూల్ టీచర్స్ రెడ్డప్ప రెడ్డి, శివరామరాజు, చెన్నకృష్ణ,నాగేంద్ర, మణి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాష అంటే భయం వద్దు

ప్రజాశక్తి-పుల్లంపేట

హిందీ భాష అంటే భయపడాల్సిన పనిలేదని ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు హిందీ పట్ల భయాందోళనల చెందనవసరం లేదన్నారు. పదిలో హిందీలో మార్కులు తగ్గకుండా కార్యసాధన చేస్తే విజయం సాధిస్తారని అన్నారు. సులభతరంగా హిందీ భాషను రాయడం,చదవడం నేర్చుకోవచ్చని తెలిపారు.దేశంలో ఎక్కువమంది ప్రజలు హిందీ భాష మాట్లాడుతున్నారని, హిందీభాషపై ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. దేశ ప్రజలందరికీ అందుబాటులో హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకుంటే ఉపయోగకరమని అన్నారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ పద్మావతి ఒక ప్రకటనలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే, రాత పరీక్ష ద్వారా పాఠశాలలో సీటు కోసం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జూలై నెల 29వ తేదీ లోగా ఆసక్తి కలిగిన విద్యార్థులు నవోదయ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు కూడా నవోదయ ప్రవేశ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



హుండీ ఆదాయాన్నిలెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుండీ ఆదాయం రూ.5.23 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయ లో ఇఒ మునిరాజా, కొండకిట్టల ఆధ్వర్యంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. మూడు నెలలుగా భక్తులు హుండి ద్వారా చెల్లించిన కానుకల రూపంలో రూ.5,23,275లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, ఉత్తమరెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

వేంపల్లె - వేంపల్లె : ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు పాపాగ్ని నదిలో కొత్త ఫిల్టర్లను వేసినట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. పాపాగ్ని నదిలో వేసిన ఫిల్టర్లను మంగళవారం సర్పంచ్ తనిఖీ చేసి నీటిమట్టం పరిశీలించేందుకు మోటర్లను ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాగ్ని నదిలో నీటి శాతం తగ్గడంతో ఆయా ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉండడంతో ఫిల్టర్లను వేయాలని అధికారులను కోరడంతో కొత్తవి వేసినట్లు చెప్పారు. ఫిల్టర్లు వేయడం వల్ల వేంపల్లెలోని ఆయా ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నీటి సమస్య పరిష్కారానికి నదిలో 5 ఫిల్టర్లను వేసి పైపులైన్ పనులు చేపట్టామన్నారు. పంచాయతీలో పని చేసే వాటర్ స్కీమ్ సిబ్బంది నీటి సమస్యను గుర్తించి అధికారులు, తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, సునీల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం : ఎపిఒ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ రమేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. ఇటీవల ఉపాధి హామీ పథకము ద్వారా రైతులకు మంజూరైన ఉద్యానవన పంటలను సాగు చేయటానికి చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం ద్వారా మండలంలో పండ్ల తోటలు, పూలతోటల సాగును ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మామిడి, అల్లనేరేడు, కొబ్బరి, దానిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పనుల తోటలు, రోజా, మల్లి వంటి పూల తోటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మంజూరు చేయిస్తున్నామన్నారు. మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 150 ఎకరాలలో పండ్ల తోటలను సాగు చేయటానికి లక్ష్యంగా చేసుకున్నామని, అందులో ఇప్పటివరకు 90 ఎకరాలలో మామిడి, కొబ్బరి, అలనేరేడు, రోజా పంటల సాగుకు జిల్లా అధికారులు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. మరో 35 ఎకరాలలో సాగుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరిగిందని, మిగిలిన 25 ఎకరాల్లో సాగుకు ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసు కుంటే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటును అందిస్తామన్నారు. పండ్ల తోటల సాగులో మొక్కలకు గుంతలు తీయడం, మొక్కలను నాటడం, తోటకు కంచ వేయడం వంటి వాటిని ఉపాధి హామీ ద్వారా చేపడుతూ, మూడు సంవత్సరాల వరకు సంరక్షణ బాధ్యతలను ఉపాధి హామీ సిబ్బంది ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. దీనితోపాటు మండలంలో 100 ఎకరాలలో పశుగ్రాస పెంపకాన్ని ఉపాధి హామీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి లక్షంగా చేసుకున్నామన్నారు. ఇప్పటికే 90 ఎకరాలలో పశుగ్రాసం పెంపకం ఉపాధి హామీ ద్వారా జరుగుతున్నాదన్నారు. ఒక్కొక్క రైతు అర్థ ఎకరాలో పశుగ్రాసాన్ని పెంచుకోవచ్చని దీనికిగాను ఉపాధి హామీ ద్వారా ఒక సంవత్సరానికి 32 వేల రూపాయలను అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఉపాధి హామీ పథకం ద్వారా అందుతున్న ప్రయోజనాలను రైతులు పొందాలని తెలిపారు.

వైభవంగా ముగిసిన ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-కలికిరి

నాలుగు రోజులు పాటు అత్యంత వైభవోపేతంగా జరిగిన కలిగిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర మంగళవారం పార్వేటోత్సవం, కల్లి పాటుతో ఘనంగా ముగించారు. శనివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఎల్లమ్మ జాతర మంగళవారం ఉదయం పర్వేటోత్సవం, మధ్యాహ్నం అమ్మవారి ఊరేగింపు చేసి భక్తులందరూ పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం కల్లి పాటు నిర్వహించి అమ్మవారి జాతరను ఘనంగా ముగించారు. నాలుగు రోజుల పాటు జరిగిన అమ్మవారి జాతరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి జాతర సజావుగా జరిగేందుకు ఆలయ ధర్మకర్త అశోక్ రెడ్డి అభినందనలు తెలిపారు.



పార్వేట ఉత్సవంలో గ్రామస్తులు

మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్ నాయుడు



చంద్రశేఖర్ నాయుడును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

టిడిపి మండల అధ్యక్షులుగా కాపర్ల చంద్రశేఖర్‌నాయుడును నియమించారు. మండల టిడిపి సంస్థాగత ఎన్నికలలో భాగంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడి, త్రిసభ్య కమిటీ అబ్జర్వర్లు చైతన్య కృష్ణ, రాజా నాయుడు నియోజకవర్గ అబ్జర్వర్ హేమాంబ ధరరావు, మండల అబ్జర్వర్ మందపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్, గ్రామ కమిటీలతో సమాచార నివేదికను తీసుకుని సీనియర్‌న ఆయకులు, కార్యకర్తలతో కలిసి మండల అధ్యక్షులుగా చంద్రశేఖర్ నాయు డును ఎన్నుకన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలం లోని నాయకులు, కార్యకర్తలను కలుపుకొని మండల అభివృద్ధికి కృషి చేస్తూ పార్టీ కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేస్తూ పార్టీని మండల వ్యాప్తంగా పటిష్టం చేయడానికి నిరంతరం శ్రమిస్తూ ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య, ఆరే సుధాకర్‌నాయుడు, కృష్ణమనాయుడు, కేశినేని నారాయణనాయుడు, జనార్ధన, పసుపులేటి వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి చుండు ఈశ్వర చంద్రప్రకాష్, ముద్ద సుభాష్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని నందిశెట్టి వీధి చర్చి వద్ద ప్రధానవీధి రోడ్డు లేకుండా మట్టితోలి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న ఇంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని నందిశెట్టి వీధి ప్రజలు అధికారులను కోరారు.ఈ సందర్భంగా మంగళవారం పలువురు మాట్లాడుతూ వీధి రోడ్డులో మట్టి తోలడంతో రోడ్డు సౌకర్యం లేక ఇతరుల జాగాలో ఉన్న పశువులు పాక ద్వారా రాకపోకలు సాగిస్తున్నామని నందిశెట్టి వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు ఇంటి నిర్మాణాలు నిర్మించిన చోట, మట్టిని తోలి రోడ్డును కప్పివేసి మట్టితో చదును చేసుకొని,వారికి సంబంధించిన ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకుంటూ రోడ్డే కనపడకుండా చేశారని ఆరోపించారు. అసలే వెడల్పు తక్కువైనా రోడ్డుల నందు ఇలా మట్టి తోలి ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు.నందిశెట్టి వీధి రోడ్డు కనపడడం లేదని,రోడ్డు చూపించమని మున్సిపల్ అధికారులను స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇంటి పన్నులు,వాటర్ ట్యాక్స్ మాత్రం వచ్చే అధికారులు కనీసం రోడ్డు సౌకర్యం లేని ఇబ్బంది పడుతున్న ప్రజలు పట్టించు కోరా అని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుకు ఎత్తుగా వేసి మట్టి



రైతులకు సూచనలు ఇస్తున్న డిఎఒ శివనారాయణ

చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపాలి : డిఎఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు చిరు ధాన్యాలపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటకు పంటల బీమాకు ఎకరాకు రూ.567లు ప్రీమియంతో ఈ నెల 15వ తేది లోపు చెల్లించిన రైతులకు వర్తింస్తుందని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులకు కనుగుణంగా చిరుధాన్యాలైన రాగి, ఉద్ది పెసర కంది పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గీత, రమేష్‌రాజు, ఆర్‌బికె సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్ల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఎడిఎ ఎల్లప్ప, ఎఒ పవన్‌కుమార్ బృందం నిర్వహించారు. విజిలెన్స్ అధికారుల దాడులను ముందే పసిగట్టిన దుకాణ యజమానులు దుకాణాలను మూసివేశారు. బస్టాండ్ సమీపంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణ యజమానులు కొనుగోలు చేసిన మందులకు బిల్లులు కూడా ఇవ్వరని రైతులు ఆరోపిస్తున్నారు. సకాలంలో అధికారులు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సాయంకాలం తెరిచి ఉన్న దుకాణాలను మాత్రమే నామమాత్రంగా తనిఖీ చేసి అధికారులు వెనుతిరిగారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించడంతోపాటు క్రీడలు, జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలు ప్రదర్శించడంలో సమర్థులుగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఇఒ-2 రామాంజనేయులురెడ్డి తెలిపారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా క్విజ్, రోల్ ప్లే, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రఓబుల రెడ్డి, జనార్ధన్, తేజస్దీప్, యోహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..పూర్తికాని కాలువ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికారుల నిర్లక్ష్యంతో బెంగుళూరు బస్టాండులో డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, వ్యాపారులకు తీవ్రనష్టం వాటిల్లడమే కాకుండా, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం వైసిపి నాయకులతో కలిసి బెంగళూరు బస్టాండులో అసంపూర్తిగా నిలిచిన డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు పనులను పరిశీలించారు. పట్టణానికి ముఖ్యమైన ప్రాంతంలో అసంపూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిత్యం రద్దీగా ఉండే బెంగుళూరు బస్టాండు సెంటర్‌లో వాహనాలు పార్కింగ్ చేసి, బస్సులు, లగేజి వాహనాలు, వెళ్ళలేని పరిస్థితి ఉండడంతో సంబంధిత అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటిన్నర నెలగా పూలవ్యాపారం లేక డ్రైయినేజీ నీరు, దుర్గంధం మధ్య ఉండలేక ఖాళీ చేసి ఇబ్బందులు పడుతున్న వ్యాపారులతో మాట్లాడారు. మురుగు కాలువల్లోని నీరు మొత్తం పూల అంగళ్ల కిందకు వదిలివేయడం గమనించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్పారావు తోట, అప్పారావువీధి, బడేమకాన్ ప్రాంతాలకు వెళ్ళే రోడ్డు ఇలా అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వర్షం వస్తే ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఒకటిన్నర నెలగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ నూర్ అజాం, కేశవయాదవ్, మల్లికార్జునరెడ్డి, శారదారెడ్డి,



డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న నిస్సార్ అహ్మద్



వలయాకారంలో కూర్చున్న విద్యార్థులు

బ్యాక్ బెంచర్స్‌లేని తరగతి గది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బ్యాక్ బెంచెస్ లేకుండా వలయాకరంలో తరగతి గదిని రూపొందించి ఒక వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఉపాధ్యాయుడు రమణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చినపుడు మా పిల్లలను ముందు బెంచీలో ఉంచండని, వెనుక కూర్చుంటే పిల్లలు చదవరని అంటుంటాని అన్నారు. మా తరగతి గదిలో ర్యాంక్‌లతో తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమేనని చెప్పటానికి ఇలా వలయకార తరగతి గదిని రూపొందించామని తెలిపారు.



తహశీల్దార్ పుల్లారెడ్డితో మాట్లాడుతున్న సుబ్బనరసారెడ్డి

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పుల్లారెడ్డిని కలిసి విభిన్న ప్రతిభావంతుల ఇంటి పట్టాల సమస్యలపై చర్చిం చినట్లు తెలిపారు. అందుకు తహశీల్దారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఇంటి పట్టాల విషయంలో మావంతు సహకారం అందిస్తామని హామీనిచ్చారని తెలిపారు. భవిష్యత్తులో విభిన్న ప్రతిభావంతులకు మావంతు సహాయ సహ కారాలు అందించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తహశీల్దార్ తెల పడం జరిగింది. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు వాహిద్ పాల్గొన్నారు.

'విడ్స్' ఆధ్వర్యంలో జనసురక్ష

ప్రజాశక్తి-రాయచోటి : మండలం సిబ్యాల గ్రామపంచాయతీ అన్నమరాజుగారి పల్లిలో మంగళవారం జన సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్యాల బ్రాంచ్ కెనరా బ్యాంకు మేనేజరు రామనాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జనదన్ యోజన ఖాతా బ్యాంకు గురించి వివరించారు. ఈ పథకంలో ప్రతి కుటుంం ఎన్‌రోల్‌మెంట్ కావాలని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకానికి 18 సంవత్సరాలనుంచి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు రూ .436 రూపాయలు చెల్లిస్తే రూ.2లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. సురక్ష బీమా యోజనకు 18 సంవత్సరాలు వయసు నుంచి 70 సంవత్సరాలు వయస్సు ఉన్నవారు రూ.20 చెల్లిస్తే రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది అన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకానికి వయస్సును బట్టి ప్రతినెల ప్రీమియం గనుక 60 సంవత్సరాల వయసు వచ్చేంతవరకు కట్టినట్లయితే 60 సంవత్సరాలు తరువాత పెన్షన్ అందుతుందని చెప్పారు. అంతరం విట్స్ సంస్థ కౌన్సిలర్ వి.కవిత మాట్లాడుతూ సైబర్ ఫ్రాడ్స్, డిజిటల్ లావాదేవీలు గురించి వివరించారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిఎం శ్రీనివాసులు రెడ్డి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ శివ నాగయ్య, విఒ నారాయణరాజు, విడ్స్ కౌన్సిలర్ ఆంజనేయులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో పంట సాగు

ప్రజాశక్తి - వేముల : కుప్పగుట్టపల్లి, చింతల్ జూటూర్ గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ జిపి ఓబులేసు మాట్లాడుతూ యాంత్రీకరణ పద్ధతి ద్వారా పంటల సాగులో ఖర్చులు తగ్గి, మంచి దిగుబడులు సాధిస్తారన్నారు. మినుములో వచ్చే పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విహెచ్ఎ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని యువకుడి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పట్టణ పరిధిలోని మన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జయపాల్‌నాయక్(19) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు..అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం, వెంకటపల్లి తాండాకు చెందిన జయపాల్ నాయక్ జీవనోపాధి నిమిత్తం రాజంపేటకు మోటార్ మెకానిక్‌గా వచ్చాడు. ప్రేమించిన యువతి తనతో మాట్లాడటం లేదని కలత చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె రూరల్ మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చీకలబైలు చెక్ పోస్ట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి నడుచుకొని వెళ్తుండగా బెంగళూరు వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎవరన్నది తెలియ రాలేదు. పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని విభిన్న ప్రతిభావంతుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, బురకాయల కోటకు చెందిన గోవిందు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మల్లికార్జున (25) మతిస్థిమితంతో బాధపడుతున్నాడు. మదనపల్లె ఆర్‌టిసి బస్టాండ్ లో భిక్షాటన చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఈ క్రమంలో ఏదో పనిమీద మదనపల్లె పట్టణం, కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వరకు చేరుకున్నాడు. అక్కడ రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా మదనపల్లె నుంచి గాలివీడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని మార్చ్యూరీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం, రామాపురం కు చెందిన చౌడప్ప (30) గత కొన్ని ఏళ్లుగా బి. కొత్తకోట మండలం కనికలతోపులో నివాసముంటూ అక్కడే నీళ్ల ట్యాంకర్ తోలుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఇతనికి భార్య కనకలక్ష్మి, కుమారుడు దేవాన్ష్ ఉన్నారు. చౌడప్ప మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ భార్య, కుమారున్ని నిర్లక్ష్యం చేస్తూ రావడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఘర్షణ పడ్డారు. మనస్థాపానికి గురైన చౌడప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆసుపత్రి కి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.